

# మా పరమాత్ముడు డ్రాయింగ్ ఐవోరు

ఏ ఇస్కూల్లో అయినా సీనియర్లంత మంచోళ్లు సీనియర్లంత లుచ్ఛాలు యింకెవ్వరూ ఉండరబ్బా.

యిదేందిది అంతలోనే మంచోళ్లు అంతలోనే లుచ్ఛాలు అంటా ఉన్నాడేందని అను కుంటా ఉన్నారా? చెప్తా.

మేము ఎయిత్ కిలాసులో ఉండగా టెన్త్ కిలాసులో హెబెనైజర్ హైడ్, డేవిడ్ అనే యిద్దరు క్రిస్టియను పిలకాయలు ఉండేవోళ్లు. వాళ్లు యింతింత ఎత్తున ఉన్నా, వాళ్ల తొడలు యింతింత లావుగా ఉన్నా హాఫు నిక్కర్లు ఏసుకునే బడికి వొచ్చేవాళ్లు.

బడిలో కొత్తగా చేరి మేము తురాయి చెట్ల కింద బెదురు బెదురుగా తిరుక్కుంటా ఉంటాము కదా, అప్పుడు యీళ్లు మమ్మల్ని పిలిచి పేరూ ఊరూ అడిగేవోళ్లు.

మేము సమాదానాలు చెప్పాక, దగ్గర కూచోబెట్టుకొని ఆ మాటా ఈ మాటా మాట్లాడి 'మీకు తెలియదు గాబట్టి ముందే చెప్తా ఉన్నాం. యీడ లెక్కలికి ఉండేది యిద్దరైవోర్లు.

పిచ్చయ్య ఐవోరు గనక వొస్తే పాటం బాగా చెప్తాడు. నోట్సు చెప్పడు. మదుసూదనరావు ఐవోరు వొస్తే నోట్సు బ్రహ్మాండంగా చెప్తాడుగానీ పాటం ముక్కజెప్పడు. గనక మీరేం జేస్తారంటే ఆయనొస్తే ఈనకాడ పర్‌వేట్ జేరండి. ఈనొస్తే ఆయన కాడ పర్‌వేట్ చేరండి. దిగులుండదు' అనేవోళ్లు.

చూసినారా ఎంత మంచోళ్లో.

అంతటితో ఆగక 'తెలుక్కి ఉండేది యిద్దరు. ఒకరు నరసయ్య ఐవోరు. ఇంకొకరు అన్నపూర్ణా టీచరు. నరసయ్య ఐవోరు గనక వొస్తే పాటం దానవీరసూరకర్ణ. ముప్పయ్యారు రీళ్లు. సూపరుగా ఉంటుంది. అయితే గలబా చేశారా? గూబ గులాబ్‌జామే. బలే కొడతాడు. అన్నపూర్ణా టీచరు వొస్తే పాటం మెత్త మెత్తగా ఉంటుంది. అట్టాగే మనం ఏం చేసినా దెబ్బలు కూడా మెత్తమెత్తంగా ఉంటాయి' అని ఎరుక జెప్పేవోళ్లు.

ఆ మాటలన్నీ విని అబ్బా ఇట్టాంటోళ్లు ఇస్కూలుకి యిద్దరుంటే చాలు పిలకాయలకి దిగులే ఉండదు అనుకుంటా ఉంటామా అంతలోనే వీళ్ళ అసలు కిండలు మొదలవుతుంది.

'ఒరే. యిన్ని జెప్పింది దేనికని అనుకుంటా ఉండారు? అసలు సంగతి చెప్పడానికే. మాకాడ నాలుగు ముక్యమైన మాటలు ఉన్నాయి. వాటిని మా సీనియర్లు మాకు జెప్పారు. మేం బద్రంగా కాపెట్టుకొని మీకు చెప్తా ఉన్నాం. మీరు కడుపుల్లో బెట్టుకొని రేపు మీ జూనియర్లకి చెప్పాల. అది యిక్కడి ఆనవాయితీ' అని, మా వంక చూసేవోళ్లు.

మేము ఆత్రం ఆత్రంగా ఏందా ముక్యమైన మాటలు అని చూస్తే కిచకిచమని పళ్లికలిస్తా వాటిని బయటపెట్టేవోళ్లు. ఆ మాటలు–

1. చాటబారతం 2. పనామాబ్లేడు 3. లూజుచేయబడును 4. యోగనిద్ర

ఇవి మా ఐవోర్ల మారుపేర్లంట. తర్వాత తెలిసింది. పిలకాయలు ఈ ఐవోర్లని ఈ మారుపేర్లతోనే పిలుచుకుంటా ఉంటారంట.

ఒక ఐవోరి ఊతపదం 'చాటబారతం'. కిలాసులో పాటం చెప్తా చెప్తా 'ఈ చాటబారతం అంతా మీకు బుర్రెదుగానీ' అనంటాడు ఆయన. లాకుంటే 'ఈ చాటబారతం కొసెను చాలా ఇంపార్టెంటు' అనంటాడు. లాకుంటే 'ఇప్పుడు గనక లేచానంటే ఒక్కొక్కరి వీపు చాటబారతమే' అనంటాడు. అందుకని ఆయన పేరు 'చాటబారతం'.

ఇంకొకాయన ఊతపదం 'పనామాబ్లేడు'. అసలు పనామా కంపెనీకి ఈ ఐవోరు చేసినంత ప్రచారం ఇంకొకరు చేసుండరు. పిలకాయలు అరిస్తే చాలు 'ఒరే... బజారుకి వెళ్లి మంచి పనామా బ్లేడు కొనుక్కొనొచ్చి ఒక్కొక్కరి ఉచ్చబుడ్డలు కోస్తా' అని అనేవాడు. 'రేపు నోట్సులు రాసుకోకుండా వొచ్చారో మీ పని పనామా బ్లేడే'... అనే వార్నింగిచ్చేవాడు. 'మీరు యిట్టగాదురా. దారికొచ్చేది పావలా పెట్టి కొత్త పనామా బ్లేడు తీసుకొని వొచ్చి'... అలా సాగిపోయేది పాటం. అందుకని ఆయన పేరు 'పనామాబ్లేడు'.

ఇంకొక ఐవోరున్నాడు. ఆయన బలే జంటిల్‌మేను. పిలకాయలకి వార్నింగ్ యివ్వడం కూడా బలే జంటిలుగా యిచ్చేవాడు. 'మీరు గనక గలబా చేశారంటే– జస్ట్– చేతిలో ఈ బెత్తం చూశారా? దీనితో మీ యొక్క పళ్లు లూజు చేయబడును' అనేవాడు. 'పళ్లు లూజు చేయబడును' అనేది ఆయన స్టాండర్డు మాట. అందుకని ఆయన మారుపేరు అది.

'యోగనిద్ర' ఐవోరి కత ఏమిరా అనంటే మద్యానం అన్నాల గంట అయ్యాక ఈ ఐవోరు ఏ కిలాసుకి ఫస్టు పిరీడు వెళ్లినా ఆ కిలాసులో అయిదు నిమిషాల సేపు తప్పనిస రిగా కునుకేస్తాడు. కునుకేసే ముందర పిలకాయలు గలబా చేయకూడదనే బయంతో 'ఒరే. ఇది నిద్రనుకుంటా ఉన్నారా? కాదు. యోగనిద్ర. కళ్ళు మూసుకున్నా మూడో కంటితో అంతా చూస్తానే ఉంటా' అనేవోడు ప్రతిసారీ. అందుకని ఆయన పేరు 'యోగని ద్ర'.

సరే. మనిషన్నాక ఎక్కువతక్కువలు ఉంటాయి. వాళ్లు ఐవోర్లు. పాటాలు చెప్తా ఉన్నారు. ఊతపదాలు ఉంటాయి. అంతమాత్రాన వాటినే వాళ్ల పేర్లుగా పర్మినెంటు చేసెయ్యడ మేనా? చేస్తిరిపో ఆస్తి అప్పజెప్పినట్టు కొత్తగా చేరిన పిలకాయలకి అప్పజెప్పడమేనా?

'తప్పుగదా' అంటే

'ఈ మాత్రం శకలు లేకపోతే ఎట్రా మనకి హైస్కూలులో' అనేవాళ్లు సీనియర్లు.

అయితే యిట్లా శకలు పోయే సీనియర్లుగానీ, యీళ్ల కాడ చేరి కాకాలు పట్టే జూని యర్లు గానీ, కొత్తగా చేరే మాలాంటి పిలకాయలుగానీ తనా మనా బేదం లేకుండా యిష్ట పడే ఐవోరు చుట్టూ చేరే ఐవోరు మా ఇశ్వోదయలో ఒకడున్నాడు. ఆయనే మా డ్రాయింగ్ ఐవోరు. అసలు పేరు జి.నాగేశ్వరరావు ఐవోరుగానీ పిలకాయలెవ్వరికీ ఆ పేరు తెలియదు. డ్రాయింగ్ ఐవోరనే పిలవడం.

మా టైంటేబిళ్లలో వారానికి రెండు పిరీడులు డ్రాయింగ్ కిలాసు ఉంటే ఆ కిలాసు కోసరం ఎంతగా ఎదురు చూసే వాళ్లమో తెలుసునా? ఆ కిలాసులో లెక్కలు యింగిలీషు అనే బోరు ఉండదు. హోంవర్కు గీంవర్కు అనే బాద ఉండదు. బెత్తం తిరగేసి ఉతక డాలుండవు.

హాయిగా బొమ్మలు గీసుకోవడమే పని. తామరపువ్వు, కుండ, రెండరిటిపండ్లు, టేబిలు మీద కొవ్వొత్తి, లాంతరు, మామిడి కాయ...

బోర్డు మీద చాక్‌పీసుతో మా డ్రాయింగ్ ఐవోరు ఆ బొమ్మలు గీస్తా ఉంటే ఆయన అంత సులబంగా గీసిన ఆ చిన్నబొమ్మలని మేము మా డ్రాయింగు బుక్కుల్లో ఎక్కించు కునేదానికి నాలుగు లబ్బర్లు కానూకి, మూడు కాగితాలు నలుపు చేసి, ఆరు పెన్సిళ్లని అరగదీసేవోళ్లం.

అంతచేసి మేము గీసిన మా వంకర టింకర బొమ్మలని చూసి ఆయన ఏమీ అనేవాడు కాదు. అందరి బొమ్మల్ని అరగంటలో ఓకే చేసేసి ఇంక అసలు పాటానికి దిగేవాడు. కుర్చీ వొదిలేసి, టేబిలు మీద రెండు కాళ్లూ నేలకి జార్చి కూచుని మాటలు మొదలుబెట్టేవోడు.

'ఒరే. వినండి. ఎంకయ్య అని ఒకాయన ఉన్నాడు. తెలిసినాయన. ఆయన మద్దురుపాడుకాడ యిటుకబట్టీలో రోజుకి పన్నెండు రూపాయలకి పని చేస్తా ఉన్నాడు. పన్నెండు రూపాయలకి ఎంత కష్టం. ఎండలు. నిప్పులు. అయినాగానీ కష్టం మానతాడా? మానడు. ఎందుకంటే ఆయనకొక కొడుకున్నాడు. వాడు ఇప్పుడు ఎయిత్ కిలాసులో ఉన్నాడు. వాడు నైన్తు చదవాలి. ఆనేక టెన్తు చదవాలి. ఉత్త చదవడం కాదు. పాసుగావాలి. పాసయ్యి ప్రయోజకుడుగావాలి. అందుకని పాపం ఆ ఎంకయ్య కష్టపడతా ఉన్నాడు. అట్టా కష్టపడతా ఉన్న ఆ తండ్రికి పుట్టిన బిడ్డడు ఎంత కష్ట పడి చదవాలిరా?' అని కిలా

సులో అందరి వంకా చూస్తా కొసెను ఏసేవాడు.

'చాలా కష్టపడి చదవాలిసార్' అనేవాళ్లం పిలకాయలం.

'మరి. కష్టపడి చదవడం లేదే. ఇస్కూలు కావడం తోటే ఎంకటేశ్వరా హాలనీ, శ్రీరామా హాలనీ ఫష్షోలకి తిరగతా ఉన్నాడు. సరే. వొదిలెయ్యండి. పెదపావని బస్టాండు కాడ శేషయ్య అని యింకొకాయన ఉన్నాడు. ఆయన దబరల్లో శొంటికాపీ పెట్టుకొని శొంటి కాపీ శొంటికాపీ అంటా తిరుక్కొని అమ్ముకుంటా ఉంటాడు. కాఫీలూ టీలూ బొర్నవి టాలూ వాడమ్మనిగొట్టలూ వొచ్చిన ఈ రోజుల్లో శొంటికాపీ ఎవుడైనా తాగతాడా? తాగడు. అయినాగానీ ఆ మనిషి కష్టపడి ఆ శొంటికాపీ అమ్ముకొని బతకతా ఉన్నాడు. దేనికి? ఆయనకొక కొడుకున్నాడు. వాడు ఈ కిలాసులోనే కూచుని ఈ మాటలు యింటా ఉన్నాడు. వాడు ఉత్త మాటల మనిషి గాకుండా బాగా చదివి చేతల మనిషి కావాలని పాపం ఆ పేదోడి కోరిక. మరి అట్టాంటి పేదోడి కొడుగ్గా పుట్టినోడు ఎంత మారాజుగా చదవాలిరా?' మళ్లీ కిలాసు అందరి వంకా చూస్తా కొసెను ఏసే వాడు.

'చాలా మారాజుగా చదవాలి సార్' అనేవాళ్లం పిలకాయలం.

'మరి. చదవడం లేదే. ఒరే. మనమంతా ఎంకయ్యల పుల్లయ్యల కొండయ్యల పిల్లలం. మన అబ్బలు కూలికి పొయ్యి గంజికి పొయ్యి కష్టపడి మనల్ని చదివిస్తా ఉన్నారు. మీరు టెన్తు పాసుగావాల. అంటే ఇప్పటి నుంచి బాగా చదవాలా. బాగా చదవతారనే ఇదంతా చెప్తా ఉన్నా' అని అందరి మనసులకీ ఎక్కేలా బుద్ధిమాటలు చెప్పేవోడు డ్రాయింగ్ అయివోరు.

అట్టా బుద్ధిమాటలు చెప్తాడుగాబట్టే ఆయనంటే మా అందరికీ బలే యిష్టం.

మమ్మల్ని బాగా చదివించేలా చేయడానికి ఇట్టా బుద్ధిమాటలు గాకుండా మా డ్రాయింగ్ ఐవోరి కాడ యింకొక రకం మాటలు కూడా ఉన్నాయి. అవి వినండి.

'ఒరే. మన బడి ఎనక ఏముందిరా?' అని అడిగేవాడాయన.

'జవహర్‌బారతి కాలేజీ ఉంది సార్' అనేవాళ్లం పిలకాయలం.

'కాలేజీలో ఎవురుంటారు రా?' అని అనేవాడాయన.

'అబ్బాయిలు.. అమ్మాయిలు ఉంటారు సార్' అనేవాళ్లం అందరం హుషారుగా.

'అబ్బాయిలని వదిలిపెట్టండిరా.. అమ్మాయిలని చూడండి. ఈ మొండిమోపి బాయిస్ హైస్కూల్లో చదవతా మీరు అమ్మాయిలనే మాటనే మర్చిపోయినారు గదరా. అసలకి కిలాసుల్లో అమ్మాయిలుంటే ఉండే ఆ కళా ఆ సంతోషం ఈ ముండమోపి బాయిస్ హైస్కూల్లో యాడుంటుందిరా. మీరు అదంతా అనుబవించాలంటే, పొడుగు పొడుగు జడలున్న ఆడపిలకాయల ఎనకనే నడస్తా కిలాసుల్లోకి ఎళ్లాలంటే.... ఏం చెయ్యాలిరా?' అనేవాడు ఆయన.

'టెన్త్ పాసుగావాలి సార్' అనేవాళ్లం మేము.

'శభాష్. హాయిగా టెన్తు ప్యాసయ్యి ఇంటరుకు వెళ్లి కాలేజీల్లో చేరి అమ్మాయిల పక్కన కూచుని వాళ్ల జడల్లో ఉన్న పూల వాసన పీల్చుకుంటా పాటాలు విని పెద్దోళ్లయ్యి మంచి మంచి ఉద్యోగాలు సంపాదించుకోండిరా' అని పాటం ముగించేవాడు.

పాపం మా డ్రాయింగ్ ఐవోరు యిట్టా మా పిరీడుకు వచ్చినప్పుడల్లా మమల్మి ముందుకు తోస్తా ములుగఱ్ఱతో పొడుస్తా చదువబ్బని మహా మహా మొద్దులనే టెన్తు పాసయ్యేలా చేయించగలిగాడు మా ఇస్కూల్లో.

ఆయన సబ్జెక్టుకి పరీక్ష, ఆ పరీక్షకి మార్కులు ఉండవుగాబట్టి ఆయన ఏమి చెప్పి నాడో ఎవరికీ తెలియకపోవచ్చుగానీ మాకు తెలుసు.

మా కుమార్‌స్వామి ఐవోరి ఆపీసులో ఆయన కుర్చీ ఎనక తొంభై అయిదు, తొంభై ఆరు, తొంభై ఏడు అని ఏ సంవచ్చరంలో మా యిస్కూలు నుంచి ఎంత మంది టెన్త్ కి లాసు పాసయ్యారో తెలియజేసే పర్సెంటేజీ చార్టు ఉంటుంది ఎప్పుడూ.

అందులో అన్ని సబ్జెక్టులు చెప్పే అందరు ఐవోర్ల వాటా ఎంతో మా డ్రాయింగ్ ఐవోరు ఒక్కడి వాటా అంత.

అందుకనే మా డ్రాయింగ్‌ఐవోరి మాట ఎత్తితే హెబెనైజర్ హైడ్, డేవిడ్ లాంటి సీని యర్లు కూడా చెంపలేసుకుంటా, నాలిక్కర్చుకుంటా 'అమ్మమ్మా. పరమాత్ముడు గదా' అనంటారు బక్తిగా.

నిజంగానే పరమాత్ముడు మా డ్రాయింగ్ ఐవోరు.

■